ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ప్రకాశం




బాపట్ల

నాలుగైదు నెలల్లో ' వెలుగొండ' పూర్తి

టిటిడి చైర్మన్ వైవి. సుబ్బారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మరో నాలుగైదు నెలల్లో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని టిటిడి చైర్మన్, వైసిపి నేత వైవి. సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో కలిసి వెలుగొండ ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. తొలుత పెద్ద దోర్నాల మండలం కొత్తూరు సమీపంలో వెలుగొండ ప్రాజెక్టు మొదటి, రెండో టన్నెళ్ళను పరిశీలించారు. అనంతరం వెలుగొండ ప్రాజెక్టు సొరంగ మార్గం వద్ద అధికారులతో ప్రాజెక్టు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల ప్రాజెక్టు పనులు రెండు సంవత్సరాలు నిలిచిపోయినట్లు తెలిపారు. తర్వాత పరిస్థితులు అనుకూలించడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి టన్నెల్ పనులు దాదాపు పూర్తి అయినట్లు తెలిపారు. ఏ నిముషంలోనైనా మొదటి టన్నెల్ ద్వారా నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రెండో టన్నెల్ నిర్మాణం 2.6 కిలోమీటర్ల మేర పని పెండింగ్‌లో ఉందన్నారు. అది పూర్తి కాగానే రెండు టన్నెళ్ళను ఒకే సారి ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాది ఆగష్టు నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ పునరావాస ప్యాకేజీ కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసే విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ▶ 2లో



వెలుగొండ ప్రాజెక్టును సందర్శిస్తున్న వైవి, మంత్రి సురేష్

మంత్రి నియోజక వర్గంలో..

దళితులకు రక్షణ లేదా..?

- కమ్యూనిస్టులకు కేసులు, జైళ్లు కొత్తేమీ కాదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

మంత్రి నియోజక వర్గంలో దళితులకు రక్షణ లేదా అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టులకు కేసులు, జైళ్లు కొత్తేమీ కాదని, వాటికి భయపడాల్సిన పని లేదని పేర్కొన్నారు. కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక గ్రామాలలో దళితు లపై అగ్రకులాల వారు చేసిన దాడిలో గాయపడిన బాధితులు, పేదల పక్షాన నిలబడి అక్రమ కేసులకు గురై జైలు పాలైన సిపిఎం కొల్లూరు మండల కార్యదర్శి తోడేటి సురేష్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నియోజకవర్గంలోనే దళితులపై దాడులు జరిగితే స్పందించని మంత్రి ఎవరికోసం పని చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత నియోజకవర్గంలో దళితుల సమస్యలు పరిష్కరించాల్సిన మంత్రి తన స్వార్ధ ప్రయోజనాల కోసం దళితులపై అధికారులతో అక్రమ కేసులు బనాయింపచేయటం దుర్మార్గమని దుయ్యబట్టారు. భూమి కోసం పోరాటం చేయటం, ధర్నా చేయటం పేదవాడి ప్రాథమిక హక్కు అని, దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆనాడు ధర్నాలు, సత్యాగ్రహాలతోనే వచ్చిందని అన్నారు. భూమి కోసం చదును చేస్తూ పిచ్చికంపను తొలగించడం నేరమా? అని ప్రశ్నించారు. అప్పుడే తహసీల్దారు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అగ్రవర్ణాలు దళితులపై పోలీసుల సాక్షిగా దాడులు చేసే స్థితిని తహశీల్దారు తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, ఆర్‌సి భూములు పేదవాడికి అప్పగించాలని చట్టంలో ఉందని, కోనేరు రంగారావు సిఫారసు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సురేష్‌ను విడుదల చేసి దాడులకు గల కారణాలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. రమాదేవి ▶ 2లో



మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

బాధితుల పక్షాన నిలబడతాం..

- ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజల గొంతుకలవుతాం
- ఉపాధ్యాయ, పట్టభద్రులు కార్పొరేట్లను తిరస్కరించండి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు
- ఒంగోలులో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా సంఘీభావ సభ



సంఘీభావ సభలో పాల్గొన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

అధికారంలో ఏ రాజకీయ పార్టీ ఉన్నా బాధితుల పక్షాన నిలబడతామని, ఏ ఒక్క వర్గం పక్షాన ఉండబోమని పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి స్పష్టం చేశారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డిలకు సంఘీభావంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల మరియు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సభ నిర్వహించారు. సభకు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు టి. గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలవకుండా చేయాలని వివిధ పార్టీలు, అనేక శక్తులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాయని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, పట్టభద్రులు, మేధావులు, నేతలంతా సంఘటితమై వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ప్రత్యేకత ఉందన్నారు. సామాజిక స్పృహ కలిగి, రాజ్యాంగ వ్యవస్థలకు అనుబంధంగా ప్రజల పక్షాన మాట్లాడే వారిగా, పోట్లాడేవారిగా గుర్తింపు ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక సమస్యలపై మండలిలో పోరాటం చేశామని వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని, రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలని, విభజన హామీలు నెరవేర్చాలని ఎప్పుడు ఒకే రకమైన నినాదంతో పనిచేశామని చెప్పారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఉద్యోగుల పిఆర్‌సి సమస్యలు పరిష్కరించాలని రాజీలేని పోరాటాలు చేశామని చెప్పారు. ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, రామాయపట్నం పోర్టును నిర్మించాలని, కనిగిరి నిమ్జ్ ఏర్పాటు చేయాలని, దొనకొండ పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేయాలని, జిల్లాలో ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించాలని అనేక సందర్భాలలో మండలి లోపల, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాటాలు చేసినట్లు తెలిపారు. నేడు రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేందుకు ఒడిఒడిగా అడుగులు వేస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ అందులో భాగమేనని చెప్పారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ఏ సంఘం నేతలతోనూ వారి సమస్యలపై మాట్లాడింది లేదన్నారు. సంఘాల నాయకులతో మాట్లాడకుండా వారి సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్ని పార్టీలు పోటీపడినా, వారికెంత మంది కార్యకర్తలు ఉన్నా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్సనర్లు, ప్రజా సంఘాలు సైన్యంగా అండగా నిలబడి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్ ▶ 2లో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

బాధితుల పక్షాన నిలబడతాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఒక్క ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడేవారు మాత్రమే కాదు, అన్నీ వర్గాల ప్రజల సమస్యలపై మాట్లాడేవారిని అసెంబ్లీ అధికారులు ఒప్పుకున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పారని, అయితే ఆయన పాలనకు ఇంకా వారం రోజులు పూర్తి అయినట్లు లేదని ఎద్దేవా చేశారు. శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డిని, టీచర్స్ అభ్యర్థిగా బాబురెడ్డిని గెలిపించి నిరూపించాలని పిలుపునిచ్చారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ ఉద్యమాలలో చురుగ్గా పనిచేనని, ఇకమీదట కూడా అందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి పనిచేస్తానని హామీ ఇచ్చారు. టీచర్స్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమాలలో పనిచేసిన అనుభవం తనకు ఉందని, భవిష్యత్తులో కూడా పోరాట పటిమని కొనసాగిస్తానని చెప్పారు. అందరి గొంతుకలమై మండలిలో తమ గళం వినిపిస్తామని చెప్పారు. సభలో మోడల్‌స్కూల్స్ అసోషియేషన్ నాయకుడు ఎన్.బోసుబాబు, కెజిబివి నుంచి రత్నమాలిని దేవి, గవర్నమెంట్ జూనియర్ కాలేజి లెక్చరర్ల అసోషియేషన్ నుంచి కె.సురేష్, పాలిటెక్నిక్ కళాశాలల అసోషియేషన్ నుంచి సాయిరాజ్, జిసిటిఎ నుంచి ఎండి. నయూం, విద్యా వికాస వేదిక నుంచి తిరుపతి, అఖిల భారత అభ్యుదయ వేదిక నుంచి మోహన్‌రావు, పెన్షనర్ల సంఘం నుంచి సిహెచ్.రాంబాబు, ఎఐటియుసి జిల్లా నాయకులు పివిఆర్.చౌదరి, నగర నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎల్ఐసి నాయకులు పారా శ్రీనివాసరావు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు యూనియన్ నుంచి సిహెచ్.జనార్ధన్, ఎపిజిబిఆర్ఎస్ నుంచి జి.రాజేంద్ర, పౌర సమాజం నుంచి జి.నరసింహారావు, మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకులు సిహెచ్. చిరంజీవి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ నుంచి జివి.రాగయ్య, విశ్రాంత ఆర్‌డిఒ వి. శ్రీధర్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి ఎం. నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ నాయకులు జి.శ్రీను, ఎల్ఐసి ఏజంట్ల సంఘం నుంచి కె.బాలచంద్రం,బిఎస్ఎన్ఎల్ నాయకులు కె.రామారావు, గ్రానైట్ వర్కర్స్ నాయకులు బి. వీరాంజనేయులు, దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపు కన్వీనర్ వెంకట్రావు, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు జివి.సుజాత, కో ఆపరేటివ్ ఎంప్లాయీస్ నాయకులు జి.రామాంజనేయులు, ఎపి గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ నుంచి డి. వెంకటేశ్వర్లు, పోస్టల్ సంఘం నుంచి నున్నా వెంకట్రావు, ఐలు నాయకులు కొండలు, సంక్షేమ హాస్టల్స్ యూనియన్ నుంచి వెంకట్రావు, ఎపి గ్రామ రెవెన్యూ అసోషియేషన్ నాయకులు పి. ఆనంద్, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు జాలాది మణిబాబు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నుంచి వి.మాలకొండయ్య, ఉన్నత విద్యా పరిరక్షణ వేదిక నుంచి రాజగోపాల్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి శ్రీరామ అజయ్, యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు ఓ.వి. వీరారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొని సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు.

నాలుగైదు నెలల్లో 'వెలిగొండ' పూర్తి

(మొదటిపేజీతరువాయి)

మంత్రి సురేష్ తనయుడు ఆదిమూలపు విశాల్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ చెప్పల్లి కనకదుర్గ,వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఇ అబుతాలిమ్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, సిఇ మురళీనాథ్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, దోర్నాల మండల వైసిపి కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు అమిరెడ్డి రామిరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి-దొనకొండ

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి చెందిన ప్రచార కరపత్రాలను సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. రాయన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో రంగారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం మీగడ వెంకటేశ్వరరెడ్డి నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. దాచూరి రామిరెడ్డి, విఠపు బాలసుబ్రమణ్యం, కె నాగేశ్వర్ పర్యవేక్షణలో నడుస్తూ, కనిగిరి మండలంలో పుట్టి జిల్లాలో అనేక చోట్ల ఉపాధ్యాయునిగా పని చేసి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. చదువుకునే వయస్సు నుంచే ఉద్యమాలలో పని చేసిన అనుభవం ఉన్న ఆయనను గెలిపించుకునేలా కృషి చేయాలని కోరారు. అంజయ్య మాట్లాడుతూ డబ్బు, ఇతర తాయిలాలకు మేధావులు లొంగరనే విషయాన్ని గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించి నిరూపించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయు నాయకులు కుందుర్తి అనిల్, కె కిరణ్, ఆర్ కోటేశ్వరరావు, శ్రీకాంత్, దాసు, ప్రభాకర్ తదితరులున్నారు.



దొనకొండలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయు నాయకులు

డీప్ బోర్ నీటితో పంటల సాగు

నీటి కోసం ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండలం కాట్రగుంట పంచాయతీ పరిధిలోని నరసాయపల్లె కాలనీవాసుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన డీప్ బోర్ ప్రజలకు ఉపయోగపడం లేదు. ఓ రైతు పొలానికి ఉపయోగపడుతుంది. ఫలితంగా నరసాయపల్లి కాలనీ వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతిపంపుల్లో నీరు అడుగంటి పోవటంతో కాలనీవాసుల అభ్యర్థన మేరకు రెండు నెలల క్రితం ప్రాథమిక పాఠశాల వద్ద డీప్ బోర్‌ను నిర్మించి ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు. నీటి సమస్య తీరింది అనుకున్న కొద్ది రోజులకే మరొక సమస్య ఉత్పన్నమైంది. డీప్ బోర్ నుంచి కుళాయిలకు సరఫరా అయ్యే పైపులైనుకు రైతు మంగమూరి పెద్దకొండయ్య అదనపు పైపును ఏర్పాటు చేసుకొని నీటిని రాగి పంటకు మళ్ళించాడు. దీంతో కొళాయిలకు నీటి సరఫరా అరకొరగా వస్తుంది. బిందె నీరు నిండాలంటే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. అసలు పనులు కాలం ముమ్మరంగా పనులు ఉండటంతో తెల్లవారుజామున లేసి నీరు తెచ్చుకొని కూలి పనులకు వెళ్లాల్సి ఉంది. పైపులైను వేసిన కొద్ది రోజులకే రంధ్రాలు పడి నీరు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని, అరకొరగా సరఫరా అయ్యే నీటి వల్ల పనులకు అంతరాయం ఏర్పడుతుందన విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తాగునీటి సమస్యను తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరు



డీప్‌బోర్ నుంచి అదనపు పైపులైన్ నీటిని తరలిస్తున్న దృశ్యం

లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణం

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయతీలో బంగారమ్మ బావి వద్ద ఉన్న బ్రహ్మంగారి గుడి వద్ద లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యల కళ్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కత్తికోట హరీష్, సాంబయ్య, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి నియోజకవర్గంలో దళితులకు రక్షణ లేదా..?

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినట్లు సురేష్‌పై అక్రమ కేసులు బనాయించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మంత్రి ఇసుక మాఫియా అండగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సురేష్‌ను జైలుకు పంపిస్తే మిగిలిన వారు ముందుకు రారని, దీంతో అక్రమ ఇసుకను తరలించుకోవచ్చుననే కుట్రతోనే ఇలా చేశారని ఆమె ఆరోపించారు. ఇది ఈ ఒక్క దళితుల సమస్య కాదని, దీనికి అన్ని దళిత సంఘాలు, ప్రజాసంఘాలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య మాట్లాడుతూ చింతల్లంక గ్రామ దళితులు కోరుకునేది ప్రభుత్వ భూములని తెలిపారు. వాటిని సాగుచేసుకుని జీవనం సాగించటానికి గత కొన్ని రోజులుగా జిల్లా కలెక్టర్, తహశీల్దారు మంత్రి నాగార్జునకు దళితులు విన్నవించుకున్నట్లు తెలిపారు. దళితులకు భూములు దక్కే వరకూ పోరాటం కోనసాగిస్తామని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై దాడులు జరిగితే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దళితుల కోసం రాజ్యాంగం కల్పించిన సాంఘిక సంక్షేమ శాఖ ఎవరి ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, ములకా సాంబిరెడ్డి , మండల నాయకులు జి.సుధాకర్, ఎం సత్యనారాయణ, బి అగస్టీన్, సుబ్బారావు, సీనియర్ నాయకులు కృపానందం పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేస్తున్న ఎస్ఐ

ప్రతి ఆటోకి పోలీసు వారి స్టిక్కర్ ఉండాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంతో పాటు పరిసర ప్రాంత గ్రామాల్లో తిరిగే ఆటో డ్రైవర్ల అందరికీ 'టుడే సేఫ్ జర్నీ' అనే సంస్థ వారు అందజేసిన స్టిక్కర్లను స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించి పొందాలని ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ఆటోలకు స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటయ్య మాట్లాడుతూ ఆటో యజమానులు వారి వారి ఆటోలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇచ్చినట్లయితే వాటిని ఆన్‌లైన్ చేసి యర్రగొండపాలెంలో తిరిగే ప్రతి ఒక్క ఆటోకి డిజిటల్ నెంబర్‌ని అలర్ట్ చేసి రేడియం స్టిక్కర్లను అందజేస్తామని న్నారు. ప్రయాణికులకు ఏదైనా ఆపద సమయంలో ఆటోడ్రైవర్ యొక్క పూర్తి వివరాలు తెలిసేలాగా ఒక పెద్ద స్టిక్కరును ఇస్తామని పేర్కొన్నారు. యర్రగొండపాలెంలో దాదాపుగా అన్ని ఆటోల వారు ఆన్‌లైన్ స్టిక్కర్లను తీసుకున్నారని చెప్పారు. ఇంకా ఎవరైనా తీసుకోనివారు ఉంటే తప్పనిసరిగా ఆన్‌లైన్ విధానంలో యర్రగొండపాలేనికి సంబంధించిన రేడియం స్టిక్కర్‌ని పొందాలని కోరారు. ఏదైనా ఆటోకు రేడియం స్టిక్కర్ లేనట్లయితే అలాంటి ఆటోలను అనుమానాస్పద ఆటోలుగా గుర్తించి తగిన ఎంక్వయిరీ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పంచాయతీ సెక్రటరీ హరిబాబుపై కేసు నమోదు

ప్రజాశక్తి-వేటపాలెం

మండల కేంద్రమైన వేటపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ కె హరిబాబుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైంది. ఇంటి పన్ను విషయంలో ఓ మహిళను దుర్భాషలాడి, భౌతిక దాడికి దిగినట్లు మహిళ ఆరోపించింది. బాధితురాలు కథనం ప్రకారం.. స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న గృహానికి ఇంటి పన్ను 50 వేల రూపాయలు లంచం తీసుకొని మరొకరికి పేరున ఇంటి పన్ను ఇచ్చారని వాపోయింది. తనకు జరిగిన అన్యాయం గురించి నిలదీస్తే తనను కులం పేరుతో దూషించి కొట్టాడని ఆరోపించారు. సెక్రటరీ హరిబాబు కూడా తన విధులను ఆటంకపర్చి తనపై దాడికి దిగారని పోలీసులకు కంప్లయింట్ ఇచ్చారు.

కేసు నమోదు

ఇరువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణ చేపట్టనున్నట్లు వేటపాలెం ఎస్ఐ జి సురేష్ తెలిపారు.

ఎవరీమె?

- భగవాన్ రాజుపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అనాథ మహిళ
- 25 రోజులుగా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న వైనం

ప్రజాశక్తి-పంగులూరు

భాష రాదు. ఎవరితోనూ మాట్లాడదు. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. ఎందుకు వచ్చిందో తెలియదు. సుమారు 42 సంవత్సరాల వయసు గల ఓ మహిళ గత 25 రోజులుగా మండలంలోని భగవాన్ రాజుపాలెంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉంటోంది. ఆమె ఎవరితోనూ మాట్లాడదు. ఎవరినీ పలకరించదు. ఆకలేస్తే మాత్రం ఏదో ఒక ఇంటికి వెళ్లి చేయి చాపుతుంది. అన్నం తిని మళ్లీ ఫ్లై ఓవర్ దగ్గరికి వచ్చి పడుకుంటుంది. పేరు చెప్పమన్నా, ఊరు చెప్పమన్నా భాష అర్థం కాక చెప్పలేకపోతోంది. ఇక్కడికి వచ్చిన పది రోజుల నుంచి ఒకే పంజాబీ డ్రెస్‌లో ఉంటోంది. కట్టుకునేందుకు మరో జత బట్టలు లేవు. కప్పుకునేందుకు ఒక దుప్పటి, రెండు మంచినీళ్ల బాటిళ్లు తప్ప మరేమీ ఆమె దగ్గర లేవు. ఆమెను ఎవరైనా మాట్లాడించాలన్నా ఫలితం కనబడటం లేదు.



భగవాన్ రాజుపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద బిక్కు బిక్కుమంటూ ఉంటున్న మహిళ

ఎవరో లారీ డ్రైవర్లు ఆమెపై అఘాయిత్యం చేసి, ఇక్కడ వదిలి వెళ్లి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఆమె చేతికి కత్తి గాయం ఉండటంతో బాధపడుతుండగా, స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి ఆమెకు ఆర్ఎంపీ దగ్గర వైద్యం చేయించాడు. రాత్రి సమయాల్లో చలికి వణుకుతూ, దోమలతో బాధపడుతున్న ఆమెను ఇటీవల ఒక వ్యక్తి మద్యం తాగి వచ్చి బలాత్కారం చేయబోగా, ఆమె అరవటంతో కొంతమంది చేరి ఆమెను ఆ రాత్రి ఒక ఇంట్లో పడుకోబెట్టుకున్నట్లు తెలిసింది. చేతిలో చిల్లిగవ్వలేక, భాష రాక, నా అనే వాళ్ళు లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక, ఎక్కడికీ వెళ్లలేక బ్రిడ్జి కిందనే కాలం వెళ్లదీస్తున్న ఈ మహిళను అధికారులు పట్టించుకోవాల్సి ఉంది. ఆమెను తన స్వగ్రామానికి చేర్చాలని, లేదా ప్రభుత్వ ఆధీనంలోని మహిళా వసతి గృహాల్లో చేర్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు రోటవేటర్ కిందపడి బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన మునగంటి వీరాచారి కుమారుడు ఆవీష్ (12) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్ కిందపడటంతో అక్కడికక్కడే మరణించాడు. సిఐ ఎం రోశయ్య, ఎస్ఐ సంమదర్ వలి ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను సేకరించారు. ఈ ఘటనపై బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-మేదరమెట్ల



కనగాల శ్రీనివాసరావు (ఫైల్)

మండలంలోని కనకాలవారి పాలెం గ్రామంలో కనగాల శ్రీనివాసరావు(58) అప్పుల బాధతో ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కొండపి ప్రాంతంలో 150 నుంచి 200 ఎకరాల వరకు భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తూ ఉండేవాడు. ఆ క్రమంలో సుమారు రూ.50 లక్షలకు పైగా అప్పులయ్యాయి. ఈ సంవత్సరం 14 ఎకరాలు మిర్చి సాగు చేశాడు. మిర్చి పంట కూడా సక్రమంగా లేనందున ఈ అప్పులు తీర్చటం కష్టం అనే ఆలోచనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మాత్రమే ఉంది. సంతానం లేదు. కొరిసపాడు ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండలంలోని కొరిసపాడు గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ యువతి గడ్డి మందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె మందు తాగిన విషయం కుటుంబీకులు గమనించి మేదరమెట్లలోని ఒక ప్రైవేట్ హాస్పటల్‌కు తీసుకొచ్చారు. పిదప ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆమె మృతి చెందింది. కొరిసపాడు ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న దృశ్యం

నాడు-నేడు ద్వారా

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి: ఏపీడీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్రంలోని 22,239 పాఠశాలలను నాడు-నేడు రెండో దశలో భాగంగా అభివృద్ధి చేస్తున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కెవి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మొగళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.1,578 కోట్ల నిధులు రివాల్వింగ్ ఫండ్‌గా విడుదల చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభానాకి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బైజూస్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందజేసినట్లు తెలిపారు. తద్వారా అత్యున్నత విద్యాప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య పొందే అవకాశం ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అందులో చదువుతున్న విద్యార్థులను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్తితికి తీసుకోవడమే లక్ష్యంగా విద్యాపథకాలు అమలువుతున్నాయన్నారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. 6 రకాల పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొగళ్ళూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాల కొండారెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి కమటేశ్వర స్వామి దేవాలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన ఆదివారం కార్యవర్గ సమావేశం జరిగింది. విశ్వకర్మల సంక్షేమం కోసం పార్లమెంటులో ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమాన్ అనే నూతన పథకాన్ని ప్రవేశపెట్టినందుకు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మునగటి నరసింహాచారి ప్రచార కార్యదర్శి చేబ్రోలు రవిచంద్రచారి, కమటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అనంత మురళి చింతలపూడి వీరయ్య గుండె మెడ హనుమంతరావు, చెన్నుపల్లి కోటిలింగాచారి, సిద్దు హరికృష్ణ బొప్పూడి వీరప్పయ్యచారి, గుండెమెడ నాగేశ్వరరావు, తొగరు చీటీ కొండాచారి, చేబ్రోలు విద్యాసాగర్, చెన్నపల్లి ఆంజనేయులు బొప్పూడి చంద్రశేఖర్ తెనాలి బ్రహ్మం, సంఘ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సంతాపం తెలుపుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-దరిశి

శుక్రవారం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వద్ద ఘాట్‌రోడ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దరిశి పంచాయతీలోని కొత్తపాలేనికి చెందిన రైల్వే టిసి పిచ్చాల నారాయణరెడ్డి, విద్యార్థి గొంగటి సురేష్‌రెడ్డిల చిత్రపటాలకు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారిని ఓదార్చి అండగా ఉంటామని పేర్కొన్నారు. అదేవిధంగా అంతకుముందు మృతదేహాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారివెంట నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, కర్నా భాస్కరరెడ్డి, బాపిరెడ్డి, కర్నా వెంకటరెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.



రైల్వే టిసి నారాయణరెడ్డి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర

భట్టిప్రోలు గ్రామానికి మార్చురీ బాక్స్ అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తుల అవసరాల దృష్ట్యా మార్చురి బాక్స్‌ను అందజేశారు. గ్రామంలో ఈ బాక్స్ అందుబాటు లేక ఇబ్బంది పడుతున్న దష్ట్యా నామినల్ రుసుంతో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేయటం జరిగిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలందరు దీనిని వినియోగించుకోవచ్చునని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, పాలకవర్గ సభ్యులు అసోసియేషన్ బృందం ఉన్నారు.



గ్రామానికి మార్చురి బాక్స్ అందజేస్తున్న బిఎఫ్ఏ సభ్యులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వైవి సుబ్బారెడ్డి

అన్నదానం, వైద్య సేవల గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్ద దోర్నాల శ్రీశైలం రోడ్డులో గల ఇస్కాన్ టెంపుల్ ప్రాంగణంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం వెళ్లే పాదయాత్ర శివ స్వాములకు, యాత్రికులకు ఇస్కాన్ దోర్నాల వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా 2 లక్షల మంది పాద యాత్ర శివ స్వాములు, యాత్రికులు అందరికీ అన్నదానం, వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు ఇస్కాన్ దోర్నాల, శ్రీశైలం మేనేజర్ అమల నిమయిదాస్ తెలిపారు. ఈ మేరకు టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దోర్నాల వచ్చిన సందర్భంగా ఆయన చేతుల మీదుగా బ్రోచర్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇస్కాన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దోర్నాల, శ్రీశైలం మేనేజర్ అమల నిమయి దాస్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు డాక్టర్ కనకదుర్గ, కనిగిరి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, గంజివారిపల్లె సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, అమ్మిరెడ్డి రామిరెడ్డి, రమణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ ఆన్స్'లో 'గేట్-2023' పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో గేట్-2023 పరీక్షలు శనివారం ప్రారంభమైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. గ్రాడ్యుయేట్ అడ్మిషన్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) - 2023 పరీక్షలను కళాశాలలో టిసిఎస్ అయాన్ సెంటర్‌లో ఆన్‌లైన్లో ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలియజేశారు. గేట్-2023 పరీక్షలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షకు ఐఐటి, మద్రాసు నుంచి ప్రొఫెసర్ ఎం శ్రీనివాసరావు పరిశీలకులుగా విచ్చేశారని తెలిపారు. ఈ గేట్ పరీక్షలు ఈ నెల 4, 5, 11, 12 తేదీలలో నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 150 మందికి 130 మంది, సాయంత్రం 125 మందికి గాను 112 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షకు మొయిద వేణుగోపాలరావు ప్రిసైడింగ్ ఆఫీసరుగా, డాక్టర్ విడి అనిల్ కుమార్ డిప్యూటీ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు.



ఎన్‌సిసి క్యాడెట్లతో మాట్లాడుతున్న కల్నల్ జయకుమార్

ఎన్‌సిసి ఉత్తీర్ణతతో మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-చీరాల

ఎన్‌సిసిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ జయకుమార్ అన్నారు. స్థానిక విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో గుంటూరు గ్రూప్ 22,23,24 బెటాలియన్ల విద్యార్థులకు ఎన్‌సిసి బి సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు సుమారు 686 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలలో వెపన్ ట్రైనింగ్, డ్రిల్, ఫీల్డ్ క్రాఫ్ట్ బాటిల్లే క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, కమ్యూనికేషన్ పలు అంశాలపై ప్రయోగ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ జయకుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి పరీక్షలలో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు బి సర్టిఫికెట్లను అందజేస్తామని, వాటి ద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో కల్నల్ సునీల్ గౌతమ్, కల్నల్ చందర్, కల్నల్ ఆర్‌పి సింగ్, కల్నల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రామారావు

ఎన్ఎంఎంఎస్ పరీక్ష వరం: డీఈవో

ప్రజాశక్తి-చీరాల: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు ఆదివారం జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల డివిజన్ పరిధిలో ఎన్ఆర్‌పిఎం, ఏఆర్ఎం, కొత్తపేట మదర్ థెరిస్సా, కొత్త పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 984 మంది విద్యార్థులకు గాను 890 మంది విద్యార్థులు హాజరవ్వగా 44 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఆర్థికంగా వెనుక బడిన నిరుపేద విద్యార్థులకు ఇది వరమని చెప్పారు. ఇందుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాటు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం రూపంలో అందజేస్తుందన్నారు. డీఈవో వెంట చీరాల ఎంఈవో డి నాగేశ్వరరావు ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద చీరాల డీఎస్పీ పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి తల్లిదండ్రులతో విద్యార్థులు గంటకు ముందుగానే వచ్చి తమకు కేటాయించిన గదులను చూసుకుని పరీక్ష రాశారు.

అమరుల త్యాగాలు విలువైనవి

స్మారక సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు





అమరవీరుల స్మారక సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి

ప్రజాశక్తి-రేపల్లె

కమ్యూనిస్టు అమరవీరుల త్యాగాలు విలువైనవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) సీపీఎం ఆధ్వర్యంలో నెహ్రూబొమ్మ సెంటర్ రేపల్లె తాలూకా అమరవీరుల స్మారకసభ ఆదివారం జరిగింది. ఈ సభకు సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అధ్యక్షత వహించారు. తొలుత ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో పోరాటాల పురిటిగడ్డ పాత రేపల్లె తాలూకా ఉద్యమం కీలకమైన పాత్ర కలిగిఉన్నదని నాయకులు పేర్కొన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వాన కష్టజీవుల ఉద్యమాలు ఎన్నో జరిగాయని, రేపల్లె ప్రాంతంలో ప్రజల కోసం తృణప్రాయంగా పోలీస్ కాల్పుల్లో మరణించినా అమరవీరులు దాసరి సుబ్బయ్య (ఇసుకపల్లి), మోటూరు వెంకటరత్నం (వెల్లటూరు), గుమ్మడి సీతారామయ్య (గుడికాయలంక), కంఠంనేని వెంకటరత్నం (పల్లెకోన), కస్తూరి కుటుంబరావు (కనగాల), ముత్తురెడ్డి వెంకటాచలం ఓలేరు, మండవ కోటేశ్వరరావు (ఆమదలంక) అమరవీరులను స్మరించుకొంటూ మైనేని సీతారామయ్య కళ్యాణ మండపం నుంచి ఇసుకపల్లి అమరవీరుల స్తూపం వద్దకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, సిపిఎం పట్టణ అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ తదితరులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు, చిన్నారుల కోలాటాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. అనంతరం జరిగిన బహిరంగసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ తీవ్ర నిర్బంధాలను, జైలు జీవితాలను, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమాలలో పనిచేసిన వారసత్వం రేపల్లెదని పేర్కొన్నారు. నేడు బీజేపీ దేశంలో ప్రమాదంగా మారిందని అన్నారు. ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. బీజేపీ ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి, ప్రధాన ప్రతిపక్షాలు రాష్ట్రానికి హెూదా ఇవ్వకపోయినా మాట్లాడటం లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు మీద భారాలు వేస్తున్నారని అన్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతలంకలో భూమి అడిగిన పేదలను అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. దేశానికి బిజెపి ఆర్ఎస్ఎస్ అతి పెద్ద ముప్పుగా మారాయని ఆరోపించారు. ప్రస్తుతం భారతదేశం ప్రమాదకర స్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి కూటమి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నాయని అన్నారు. ఈ రెండింటి సిద్ధాంతాలను ప్రజలపై బలంగా రుద్దుతున్నారని అన్నారు. దేశ సార్వభౌమ అధికారం ప్రమాదంలో పడింది ఆర్ఎస్ఎస్ బిజెపి కలిసి దేశ మౌలిక వసతుల్ని మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో మోటూరు హనుమంతరావు, కొరటాల సత్యనారాయణ లాంటి సిపిఎం అగ్రనేతలు రేపల్లె నుంచి ఎదిగి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రజాఉద్యమాలు నడిపారని పేర్కొన్నారు. మోటూరు, కొరటాల రేపల్లె అమరవీరుల స్ఫూర్తితో రేపల్లె శాసన సభ్యులుగా ప్రాతినిధ్యం వహించినప్పుడు దళితులు, వ్యవసాయ కూలీలు, రైతాంగం, చేనేత, మహిళా, వృత్తిదారుల సమస్యలపై పోరాటాలు నడిపారని గుర్తు చేశారు. పాత రేపల్లె తాలూకా గ్రామాలలో శ్మశాన వాటికలు ఆ రోజులలోనే గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, రోడ్లు తదితర పనులతో లంక గ్రామాల అభివృద్ధికి నాంది పలికారన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళటం మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమిస్తున్న అమాయక రైతులపై కూడా వైసిపి దాష్టీకం కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వం పేదల పక్షమా లేక పెత్తందార్ల పక్షమా అని నిలదీశారు. కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక, గాజులంక గ్రామాలకు చెందిన దళితులు మండల పరిధిలోని ఆర్‌సి భూములను సాగు చేసుకుంటున్న క్రమంలో సహించలేని అగ్రవర్ణాల వైసిపి పెత్తందారులు వారిపై మంగళవారం అరవింద వారధి వద్ద దాడికి పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాధ్యత తనదేనని మొసలి కన్నీరు కార్చిన ప్రధాని గత ఎనిమిది సంవత్సరాలుగా ద్రోహం చేస్తూనే వచ్చారు. రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టుపెట్టింది. భారత దేశాన్ని మతోన్మాద దేశంగా మారుస్తున్న బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని పీఠిక నుంచి సెక్యులరిజం, సోషలిజం పదాలు మాయమవుతాయని అన్నారు. అలాంటి దుష్ట శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. ఈ బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం సీతారాం, ఆంధ్ర మాల్యాద్రి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనీల్ కుమార్, సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, నాయకులు జి సుధాకర్, కె శరత్ తదితరులు పాల్గొన్నారు.







అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజానాట్యమండలి కళాకారుల ఆటాపాటా, వేదికపై పాటలు పాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ బృందం

'సృజన సాహితీ వైభవం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి

సాహితీ సుక్షేత్రం సృజన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజన సాహితీ వైభవం పుస్తకావిష్కరణ సభ ఆదివారం జూనియర్ కళాశాల సమీపంలోని రామ సుశీల నిలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉబ్బా దేవపాలన అధ్యక్షత వహించారు. కవిజన హితంగానూ, సమాజానికి సన్నిహితంగానూ, అద్దంకిలోని అన్ని సాహితీ సాంస్కృతిక సేవాసంస్థలకు స్నేహవాటికగానూ, కవిమిత్రుల కవితాగాన వేదిక గానూ ప్రకాశిస్తున్న సృజన పాతికేళ్ళ ప్రయాణాన్ని మంచిశైలితో, పొందికైన భాషతో, భావితరాలకు స్ఫూర్తిగా, అక్షరబద్ధం చేయడంలో గ్రంథ రచయిత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి కృతకృత్యులైనారని, సాహితీ సుక్షేత్రం సృజన అని తన అధ్యక్ష ప్రసంగంలో డాక్టర్ యు దేవపాలన పేర్కొన్నారు. పుస్తకాన్ని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఇప్పగుంట మల్లికార్జునరావు ఆవిష్కరిం చారు. సృజన చేసిన సాహిత్య కృషిని భవిష్యత్ తరాలకు అందించడమంటే ప్రకాశం జిల్లా సాహిత్య చరిత్ర చెప్పడమే అని మల్లికార్జునరావు అన్నారు. సృజన వ్యవస్థాపక అధ్యక్షులు, ముఖ్య అతిథి డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. డివిఎం సత్య నారాయణ మాట్లాడుతూ సృజన సాహితీవైభవం అంటే అద్దంకి సాహిత్య చరిత్ర, సృజన సాహితీ ప్రయాణాన్ని ఒక క్రమపద్ధతిలో వివరిస్తూ, సంఘటనల సమాహారంగా, దృశ్యరూపకం అనిపించేలాగు 26 సంవత్సరాల సృజన సాహితీ వైభవాన్ని, నాటి మధుర స్మృతులను కళ్లకు కట్టినట్లు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రాశారని డివిఎం సత్యనారాయణ అన్నారు. సృజన కవుల, పండితుల, అవధానుల ప్రతిభావ్యుత్పత్తులను పుస్తకంలో ప్రస్తావించడం ద్వారా ఈ పుస్తకం ఒక ప్రత్యేకతను సంతరించుకుందని విద్వాన్ జ్యోతి చంద్రమౌళి అన్నారు. తన అనుభూతులను అందంగా వ్యక్తీకరించడంలో పుట్టంరాజు సఫలీకృతులయ్యారని గాడేపల్లి దివాకర దత్తు శ్రీరామచంద్ర మూర్తి అభినందించారు. సభా కార్యక్రమాలు రూపొందిం చడం, సమయపాలన పాటించడం, యూట్యూబ్ ద్వారా సృజన సాహిత్య కార్యక్రమాలను ప్రపంచానికి తెలియ చేయడంలో పుట్టంరాజు తనదైన ముద్ర చూపించారని వక్తలు పేర్కొన్నారు. పుస్తక రచయితను ఇలపావులూరి సాయి, కె అనిలకుమారసూరి, వారణాసి రఘురామశర్మ, ఓరుగంటి ప్రసాదు, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, జాగర్లమూడి ప్రతాప్, చుండూరి మురళీ సుధాకరరావు అభినందించారు. కె అనిలకుమార సూరి, ఓరుగంటి ప్రసాదు, కందుల నాగిరెడ్డి, అంజాద్ బాషా, వామరాజు వెంకటేశ్వర్లు, నిమ్మరాజు నాగేశ్వర రావు, లక్కరాజు చంద్రశేఖర్, టి కృష్ణయ్య, ధేనువకొండ సుబ్బయ్య, ధర్మవరపు సీతారామయ్య, కందికట్ల సత్యం, లక్కరాజు సాంబశివరావు, మువ్వా ప్రసాదు, జాగర్లమూడి ప్రతాప్, కె పోలిరెడ్డి, ఓరుగంటి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, మారం కోటేశ్వరరావు, పిసిహెచ్ కోటయ్య, జి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



'సృజన సాహితీ వైభవం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ ప్రియులు

ఐక్యపోరాటాలతో సమస్యలకు పరిష్కారం

సిఐటియు జిల్లా మాజీ నాయకుడు ఎస్‌డి.హనీఫ్

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఐక్యపోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా మాజీ నాయకుడు ఎస్‌డి.హనీఫ్ తెలిపారు. సిఐటియు 5వ మహాసభలు మండల కార్యదర్శి ఎస్.తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మరియు అనుబంధసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో హనీఫ్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు మరియు కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆవలంబిస్తున్న విధానాల పట్ల అసహనం వ్యక్తంచేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యప్రజలు అల్లాడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం, ఆశా, విఆర్ఎలు చాలిచాలని జీతాలతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. జీవో నంబర్ 1ని రద్దుచేసేవరకు నిరంతరం పోరాటాలు జరుగుతూనే ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఐద్వా జిలా ్లకార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీల యూనియన్ మండల నాయకురాలు రఫియా, ఆశావర్కర్స్ నాయకురాలు రమాదేవి, మధ్యాహ్నభోజన పథకం నాయకురాలు ఎస్.తిరుమలమ్మ, పెయింటర్స్ యూనియన్ నాయకుడు షేక్.నజీర్, విఆర్ఎల సంఘం నాయకులు రామలింగయ్య, సిఐటియు జిల్లానాయకులు రాయల్ల మాలకొండయ్య, స్వచ్ఛభారత్ కార్మకుల యూనియన్ నాయకుడు మామిడి పుల్లయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు : రమేష్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. స్థానిక వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాలలో సిఐటియు ప్రతినిధుల సభ ఏసురత్నం అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సిఐటియు జెండాను విఆర్ఎల సంఘం నాయకులు ఐ.రామలింగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎ. రమేష్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగినవిధంగా బుద్ధిచెప్పాలని అన్నారు. మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కషిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్.తిరుపతిరెడ్డి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాఘవమ్మ, ఐద్వా నాయకురాలు ఊసా రాజ్యలక్ష్మి, వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకుడు ఎన్. వెంకటరామయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రఫియా, ఎస్.తిరుమలమ్మ, రాయల్ల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మందులు విక్రయించొద్దు

15 నుంచి నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


మాట్లాడుతున్న నాయకులు

ఆన్‌లైన్‌లో ఔషధ మందుల అమ్మకాలు, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక లావాదేవీలను వ్యతిరేకంగా ఈనెల 15 నుంచి మార్చి 15 వరకు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.బాలు, పావులూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక మాజీ అధ్యక్షుడు డి.కస్తూరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందులు చేయరాదని తెలిపారు. ఆన్‌లైన్‌లో నకిలీ మందులు ,కాలం చెల్లిన మందలు డూప్లికేట్ మందులు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. ఆన్ లైన్ మందులు అమ్మకానికి ఇంకా చట్టం రూపొందించలేదని, అయినా ఈఫార్మసీలు ఆన్ లైన్‌లో మందులు సరఫరా చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరిపై చర్యలు తీసుకోకుండా ప్రజల ఆరోగ్యం తో చెలగాట మాడుతున్నాయన్నారు. సమావేశంలో ఈ నెల 15న ఒంగోలులో మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలో మందుల షాపులు మూసివేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలు , పావులూరి శ్రీధర్ , వేమూరి సుబ్బారావు, జి. వెంకారెడ్డి, జి.మధుసూదన్ రావు ,కొల్లా మధు, వి.వెంకట్రావు ఎం.రమణారావు , వెంకట సుబ్బారావు , ఏడుకొండలు , సతీష్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని 31వ డివిజన్ పరిధిలోని మామిడి పాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరిం చాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొన సాగుతోందని చెప్పారు. పేదల సంక్షేమ కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు,స్థానిక కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజినీర్ మాల్యాద్రి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

టెక్నీషియన్స్‌కు వైద్య సేవలు

డాక్టర్ చాపల వంశీకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని రిఫ్రిజిరేటర్లు, ఎసి టెక్నీషియన్స్‌కు ఎప్పుడైనా వైద్య సేవలు అందిస్తామని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ఒంగోలు రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ టెక్నీషియన్స్ గురువులను గుర్తు చేసుకుంటూ గౌరవించే సాంప్రదాయంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది టెక్నీషియన్ కుటుంబ సభ్యులందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.. టెక్నీషియన్స్ అందరూ చిరకాల మిత్రులని వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉచితంగా మందులు కూడా అందిస్తామన్నారు. స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మసూద్ జాని మాట్లాడుతూ తమ గురువు గారు సోమా శ్రీనివాసరావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించేవారమన్నారు. ఈసారి సభ్యుల కోరిక మేరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఏసీ టెక్నీషియన్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మసూద్ జానీ, నగర అధ్యక్షుడు మీర్, సెక్రటరీ రామారావు, కోశాధికారి రమీజ్, జయ ప్రకాష్ కమిటీ సభ్యులు, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్య బందం డాక్టర్ చాపల శాంతకుమారి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ నవీన్, డాక్టర్ ధీరజ్ బాబు డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గిద్దలూరు

ప్రస్తుత పర్యావరణ పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా మామిడి పంటకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి డి.శ్వేత తెలిపారు. మండల పరిధిలోని గడికోట గ్రామంలో మామిడి పంట పరిరక్షణ, సాగుపై రైతులకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ మామిడిలో పూత దశ నుంచి సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, గడికోట గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


క్రీడాకారులను అభినందిస్తున్న సూర్య ప్రకాశరావు

వాలీబాల్ క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందిం చుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సూర్య ప్రకాశరావు తెలిపారు. ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల విజయోత్సవ అభినందన సభ స్థానిక పాటిబండ్ల గోపాల స్వామి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో జూనియర్ బాలికల జట్టు హ్యాట్రిక్ విజయాలతో విన్నర్‌గా నిలిచింది. జిల్లా చరిత్రలో మునుపెన్నడు లేనివిధంగా సీనియర్ జట్టు తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది. విజయం సాధించిన మహిళా క్రీడాకారులను అతిథులు అభినందించారు. అనంతరం మౌర్య మెడికల్స్ అధినేత మారుతి అందించిన క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.మాలకొండయ్య, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సూదనగుంట కోటేశ్వరరావు(బుజ్జి) ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు డాక్టర్ జి.ధనుంజయరావు, అపర్ణ, కార్యవర్గ సభ్యులు, వాలీబాల్ కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


కేకును కోస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు

శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల 41వ, శ్రీ గురుదత్త ఉన్నత పాఠశాల 16వ వార్షికోత్సవ వేడుకలు పేర్నమిట్ట క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త పివిఎల్.రాజు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు గుర్రం రవికుమార్, శ్రీ ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివిఎల్.రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని దష్టిలో ఉంచుకొని విద్యార్థులు మంచిగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. గుర్రం రవికుమార్ మాట్లాడుతు ఎన్నో లక్షల మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కారణమైన శ్రీ ప్రతిభ విద్యాసంస్థలకు 41వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లుగారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటిని సాధించుకోవటానికి ప్రణాళికా బద్ధంగా, క్రమశిక్షణతో చదవాలన్నారు. అప్పుడు విజయాలు, ర్యాంకులు వారి పాదాక్రాంతమవుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఒ నల్లూరి జయప్రకాశనారాయణ, వలేటి తిరుపతయ్య, పాలడుగు నాగరాజు, శ్రీ గురుదత్త ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపల్ ఎ. గోపినాథ్, యం. రమేష్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- చేపలు పట్టుకొనేందుకు చెరువులోని నీటిని బయటకు వదులుతున్న వైనం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పాత చెరువులో చేపలు పట్టేందుకు నీటిని వృథాగా బయటకు వదలుతున్నారు. గోపాలపురానికి చెందిన రైతులు గతంలో చెరువులోని నీటిని బయటకు పెట్టడాన్ని అడ్డుకుని కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు చెరువులోని నీటిని బయటకు విడుదల చేయకుండా నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ చెరువు ఆయకట్టు 365 హెక్టార్లు ఉంది. నాలుగేళ్ల క్రితం చెరువులు ఎండిపోవడంతో పొల్లాలు బీడుగా మారి చిల్లచెట్లు పెరగడంతో వ్యవసాయం సాగు కాలేదు. ప్రస్తుతం చెరువులో నీళ్ల ఉన్నందున గ్రౌండ్ వాటరు వల్ల బోర్ల నుంచి పుష్కలంగా నీరు వస్తుంది. ఈ నేపథ్యంలో చెరువుపై చేపల కాంట్రాక్టర్ల



తూము నుంచి వృథాగా పోతున్న నీరు

కన్ను పడింది. పంచాయతీ నుంచి అనుమతి తీసుకొని చేపలపట్టేందుకు కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు చెరువులోని నీటిని బటయకు వదిలే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. చెరువులోని నీటిని బయటకు వదిలేందుకు చెరువుకట్ట ఆనుకుని ఉన్న 2 ఎకరాల భూమిలో వరి సాగు చేసి నీటిని వదులుతున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నీటి విడుదలను ఆపాలని కోరుతున్నారు.



ఖాళీ అవుతున్న చెరువు

- గతంలో నీటి కష్టాలు

చెరువులో నీరు లేని సమయంలో భూగర్భ జలాలు ఎండిపోయాయి. దీంతో ఇళ్లలోని బోర్ల నుంచి నీరు రాలేదు. అంకాలమ్మవీధి, ఇరువూరు రోడ్, ఎన్‌జిఒ కాలనీ, సిఎస్‌పురం రోడ్ సెంటర్, స్టేట్ బ్యాంక్ వీధి తదితర ప్రాంతాల్లో వాడుకొనేందుకు కూడా నీరు ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లారు. అప్పట్లో ప్రజలు నీటి కోసం నీళ్ల బిందెలలో పంచాయితీ కార్యాలయం ధర్నాలు, అంకాలమ్మ వీధిలో నిరసన తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

టిటిడి చైర్మన్ వైవి. సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-పెద్దారవీడు

ఆలయాల అభివద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సాకారాలు అందించాలని టిటిడి చైర్మన్ వైవి. సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసియున్న శ్రీరాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం ఆదివారం శంకుస్థాపన చేశారు. గోమందిరం ప్రారంభించారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో కలిసి ఆదివారం సందర్శించారు. తొలుత అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో టిటిడి చైర్మన్, మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువ, పూలమాలతో ఆలయ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, ఇఒ చెన్నకేశరెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో తిరులనాథస్వామి నిర్మాణ పనులు చేపట్టడం ఎంతో శుభపరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యేర్వ ఆల్లూరమ్మ, ఎంపిటిసి గోదాపు సబ్బమ్మ, మంత్రి తనయుడు విశాల్, వైసిపి మండల కన్వీనర్లు పాలిరెడ్డి కష్ణారెడ్డి, కొప్పర్తి ఓబులరెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపిపిలు బెజవాడ పెద్దగురవయ్య, కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డి. మాజీ ఎంపిపి ఆళ్లఆంజనేయరెడ్డి, కౌన్సిలర్, శ్రీశైలం దేవస్థానం మెంబరు డాక్టర్ చెప్పలి కనకదుర్గ. ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వీరనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కందుల కాశిరెడ్డి, సాంబిరెడ్డి, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




పూజలు నిర్వహిస్తున్న వైవిసుబ్బారెడ్డి, మంత్రి సురేష్

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : వరికూటి

ప్రజాశక్తి -శింగరాయకొండ

ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసిపి కొండపి నియోజక వర్గఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. శింగరాయకొండలోని వైసిపి కార్యాలయంలో వాలంటీర్లు, గహసారధులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ. గహ సారధులు, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కట్ట శోభారాణి ,వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి , వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి ,సచివాలయం కన్వీనర్ల మండల అధ్యక్షుడు తన్నీరు సుబ్బారావ , యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు షేక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.**టంగుటూరు :** వైసిపి అభివద్ధి కోసం నిస్వార్ధంగా పనిచేసే గహ సారుధులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు భరోసా ఇచ్చారు. స్థానిక పురం సెంటర్‌లో గహ సారధి తక్కెళ్ళపాటి విజయలక్ష్మి కుటుంబంతో కాఫీ విత్ గహ సారథి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ఉదయం 6 గంటలకే వారి ఇంటికి వెళ్లి నాయకులను పరిచయం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా గహసారథుల పనితీరు ఉండాలని అశోక్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, ఎఎంసి డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, బొడ్డు రవీంద్ర, శిఖా సుబ్బారావు, కొమ్ము కోటేశ్వరరావు, దుగ్గిరాల పేర్రాజు, దాసరి సుబ్బారావు, వెల్డన్ శ్రీను, బిళ్ళా అనిల్, యరమాల నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కిట్లు అందజేస్తున్న అశోక్‌బాబు

సచివాలయ ఉద్యోగాలపై అవగాహన

ప్రజాశక్తి-కనిగిరి

కృషి,పట్టుదలతో విజయం సాధించవచ్చని పశువైద్యుడు డాక్టర్ పేరయ్య, కనిగిరి మోడల స్కూల్ ప్రిన్సిసూల్ వివి. రమణయ్య తెలిపారు. కెటిసి స్టడీ సర్కిల్‌లో సచివాలయ ఉద్యోగాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు జి. శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగాలకు సబ్జెక్ట్‌లో పట్టు సాధించాలన్నారు. అందుకు తగిన శిక్షణ తప్పని సరి అని పేర్కొన్నారు. కెటిసి స్టడీసర్కిల్ డైరక్టర్ పాపారాయుడు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగాలకు లాభాపేక్ష లేకుండా అంకితభావం కలిగిన బోధన సిబ్బందితో విజయంసాధించేందుకు కెటిసి స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎపిమోడల్ స్కూల్ ఎస్‌ఎంసి చైర్మన్ గోపిశెట్టి బాలచెన్నారావు,ఆంగ్ల ఉపాధ్యాయులు మల్లికార్జున, జెవివి నాయకులు గయాజ్,సచివాలయ ఉద్యోగులు సురేష్, రాంగోపాల్, నాగార్జున, స్వప్న, శ్రావణ్,కెటిసి సభ్యులు, అధ్యాపకులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ళ గ్రామానికి చెందిన మెండా నారాయణ మూర్తి, జ్యోతి దపంతుల కుమార్తె రియాన్సిక పుట్టినరోజు సందర్భంగా శానంపూడి పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీకి చెందిన చిన్నారులు, గర్భిణులు, వద్ధులకు అన్నదానం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు నిరాడంబరంగా పేదల మధ్య నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పర శివ, మోక్షజ్ఞ, సాత్విక్, నవ్య శ్రీ, చొప్పర శివరాం, శానంపూడి యువత సాయి మదన్, ప్రదీప్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-తర్లుపాడు

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో మండల పరిధిలోని కేతగుడిపి దళితవాడకు చెందిన 25 కుటుంబాల వారు ఆదివారం టిడిపిలో చేశారు. టిడిపిలో చేరిన వారిలో పందిటి సామేలు, డీలర్ డేవిడ్, బేతం గురువు, పందిటి రమేష్, పెరికే చిన్నమోషే, పెరికి ఏబు, బేతం గురవయ్య, బేతం మోహన్, కటికల బాలయ్య, బేతం నరసయ్య, గాలి ముట్టిపాపయ్య, గాలి ముట్టి పురుషోత్తం, కటికల టోనీ, పెరికే ఉదయ్, కటికల నాగరాజు, పెరికే విజయ్, పులుకూరి కొండయ్య, పందిటి ఇజ్రాయిల్, పెరికే జాన్, బేతంరాజు, కుమార్, పులుకూరి యాకోబు తదితరులు ఉన్నారు.



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పర్యాటకులకు అవగాహన

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరానికి వచ్చిన పర్యాటకులకు పోలీసుల ఆదివారం అవగాహన కల్పించారు. ప్రజలు పాకల సముద్ర తీరం వద్ద అవగాహన ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సముద్ర తీరానికి వచ్చిన పర్యాటకులకు మెరైన్ పోలీసులు. శింగరాయకొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మెరైన సిఐ కిషోర్ కుమార్, ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సముద్రంలో మునిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

గృహ ప్రవేశ వేడుకల్లో దారపనేని

ప్రజాశక్తి-పామూరు

పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన దారపనేని కష్ణ, సునీత దంపతులు నూతన గహప్రవేశం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని దారపనేని కష్ణ సునీత దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పావులూరి శ్యామలమ్మ, కొండయ్య దంపతులు, నూతంగి నారాయణరావు, నూతంగి నరసింహారావు, నూతంగి లక్ష్మీనారాయణ, దారపనేని కష్ణ, తిరివీధి ముకుందరావు, తిరివీధి పెద్ద చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష





ఇంకొల్లులో అర్హత పరీక్షకు హాజరైన విద్యార్థులు, పంగులూరులో విద్యోన్నతి ఫౌండేషన్ నిర్వహించిన పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

పదో తరగతి విద్యార్థులకు విద్యోన్నతి ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆదివారం 3 మండల కేంద్రాల్లో జరిగింది. ధూళిపాళ్ళ వేంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి మెమోరియల్ విద్యోన్నతి స్కాలర్‌షిప్ 2023 సంవత్సరానికి గాను 15 మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు రాత పరీక్ష నిర్వహించారు. మార్కుల ఆధారంగా అద్దంకి, జె. పంగులూరు, ఇంకొల్లు మండలాలల్లో మండలానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి వారికి, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు చదువుకునేందుకు 2 సంవత్సరాల పాటు, ప్రతి ఏటా రూ.10,000 చొప్పున అందజేయనున్నారు. 15 మంది విద్యార్థులకు మొత్తం రూ.3,00,000 స్కాలర్‌షిప్ ఇవ్వబడుతుందని సంస్థ డైరెక్టరు, విశ్రాంత సిండికేట్ బ్యాంకు అధికారి ధూళిపాళ్ళ వీరనారాయణ తెలిపారు. పరీక్షకు మొత్తం 333 మంది విద్యార్థులు 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకున్నారు. అద్దంకి ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాటశాల కేంద్రంలో 132 మంది, పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 88 మంది మరియు ఇంకొల్లు ఎన్‌ఆర్‌అండ్‌వివిఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 85 మంది విద్యార్థులు మొత్తం 305 మంది పరీక్షకు హాజరయ్యారు. 172 మంది ఇంగ్లీషులో, 133 మంది తెలుగులో అర్హత పరీక్ష రాశారు. పరీక్ష రాసిన వారందరికీ రూ.24,000 విలువ కలిగిన పెన్, పెన్సిల్, రాత కోసం పాడ్‌లు విద్యోన్నతి ఫౌండేషన్ వారు అందజేశారు. ఈ పరీక్ష నిర్వహణలో ప్రధానోపాధ్యాయురాలు ఉదయకుమారి, ఉపాధ్యాయులు కృష్ణారావు, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వాసు, వలేటి సుబ్బాయమ్మ, బోడెంపూడి జయశ్రీ, విశ్రాంత ఉద్యోగులు టి బాబురావు, నాగయ్య, అద్దంకి పట్టణ కమిటీ అధ్యక్షులు త్రిమూర్తులు, విద్యార్థి పవన్, నల్లూరి తరుణ్ తదితరులు పాల్గొని సహకారమందించారని సంస్థ మరో డైరెక్టర్ బోడెంపూడి జయశంకర్ తెలిపారు.

పంగులూరు: విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఆబ్జెక్టివ్ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష, ఆదివారం మండల కేంద్రమైన పంగులూరులో జరిగింది. ఈ పరీక్ష మాజీ సర్పంచ్ దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెచ్‌ఎం బోడెంపూడి రామ్మూర్తి జ్ఞాపకార్థం నిర్వహించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు వీరనారాయణ తెలిపారు. ఈ పరీక్షను పంగులూరు హైస్కూల్లో, ఇంకొల్లు బాలికల హైస్కూల్లో, అద్దంకి ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్వహించామని తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 333 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, అందులో 316 మంది విద్యార్థులు పరీక్ష హాజరయ్యారని తెలిపారు. మండల వారీగా ర్యాంక్ సాధించిన మొదటి 15 మంది విద్యార్థులకు, మండలానికి ఐదుగురు చొప్పున 3 మండలాలకు కలిపి 15 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికి సంవత్సరానికి 10,000 రూపాయలను, రెండు సంవత్సరాలు స్కాలర్‌షిప్‌గా అందిస్తామని తెలిపారు. 15 మంది విద్యార్థులకు ఇంటర్ లేదా తత్సమానమైన కోర్సులలో చేరిన వారికి, ఒక్కో సంవత్సరానికి 10,000 రూపాయల చొప్పున, రెండు సంవత్సరాలకి 20,000 రూపాయలు అందిస్తామని తెలిపారు. 15 మంది విద్యార్థులకు రెండు సంవత్సరాలకు మొత్తం మూడు లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను మెరుగైన విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్టు వీరనారాయణ చెప్పారు. పంగులూరు హైస్కూల్లో జరిగిన పరీక్షలో పంగులూరు నుంచి 15 మంది, ముప్పవరం నుంచి 9 మంది, అలవలపాడు నుంచి 14 మంది, బూదవాడ నుంచి 20 మంది, చందలూరు నుంచి 21 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటీర్లు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రథ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కరణం వెంకటేష్

రథ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చీరాల

పేరాల గంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగ మల్లేశ్వరస్వామి దేవస్థాన నూతన పెద్ద రథ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపనతో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వైసిపి చీరాల నియోజకవర్గ బాధ్యులు కరణం వెంకటేష్, మున్సిల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు హాజరయ్యారు. భద్రావతి సమేత భావనారుషిస్వామి దేవస్థాన ప్రాంగణంలో శంకుస్థాపనకు సంబంధించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాసరావు, అన్నదాత పాండురంగారావు, పలమర్తి రాజేంద్రప్రసాద్, గోలి జ్ఞాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మా సామాజిక వర్గానికి ప్రాధాన్యతేదీ?

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు నియోజకవర్గంలో 60 వేల మంది ఓటర్లుగా ఉన్న తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఓ సామాజికవర్గం వారు వాపోయారు. నియోజకవర్గంలోని ఆ సామాజికవర్గ ముఖ్య నాయకులు ఆదివారం ఒంగోలులోని అతిథి కళ్యాణ మండపంలో సమావేశమయ్యారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు గెలుపు కోసం అవిరళ కషి చేశామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నాయకులు తమకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి అందరూ ఐక్యంగా ఉండి ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకుసాగుదామని నిర్ణయించారు. తద్వారా అందరికీ గౌరవం దక్కుతుందని అన్నారు. ఎవరికైనా ఇబ్బందులు కలిగితే సంఘటితంగా వుండి మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఎంఎల్‌ఏ ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని నిర్ణయించుకున్నట్లు సమాచారం. స్వయంగా ఎంఎల్‌ఏ సొంత నిర్లయాలు తీసుకుంటే తగున్యాయం జరిగి ఉండేదేమో కాని నాలుగు మండలాల్లో షాడో ఎంఎల్‌ఏలు ఉండి మొత్తం చక్రం తిప్పుతున్నారని, దాంతో తమకు ఎటువంటి గుర్తింపు ఉండటం లేదని వాపోయారు. అంతమాత్రాన పార్టీకి వ్యతిరేకంగా ఎవరమూ పనిచేయమని, పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేస్తామని అన్నారు. అనంతరం 12 మందితో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ ద్వారానే అన్ని సమస్యలు పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో సుమారు 100 మంది పాల్గొన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో మద్దిపాడు ఏఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు, నాయకులు కోయి హనుమయ్య, మద్దిపాడు మండలం నుంచి మండవ అప్పారావు, చీమకుర్తి మండలం నుంచి మేదరమెట్ల శ్రీనివాసరావు, సంతనూతలపాడు మండలం నుంచి బొల్లినేని కృష్ణయ్య, మాదాల నరసయ్య, బొక్కిసం శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో సమావేశమైన ముఖ్య నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బుర్రకథ పితామహుడు షేక్ నాజర్‌కు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ప్రజాదరణ కోల్పోతున్న ప్రాచీన కళ బుర్రకథకు కొత్త రూపు రేఖలు దిద్ది అందమైన ఆహార్యాన్ని సమకూర్చి బుర్రకథకు మహోన్నత వైభవాన్ని ప్రసాదించి బుర్రకథ పితామహునిగా నాజర్ ప్రసిద్ధి నొందారని బాపట్ల సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కే కోటి రాజ్ వివరించారు. ఆదివారం నాజర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, అల్లూరి సీతారామరాజు తదితర కథలలో నవరసాలు పండిస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించే వారన్నారు. సప్తస్వర సంగీత కళాశాల ఆధ్వర్యంలో జరిగిన బుర్రకథ పితామహుడు నాజర్ 103వ జయంతి సభకు అధ్యక్షత వహించిన సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ షేక్ నాజర్ నటుడు, ప్రజా రచయిత, గాయకుడు అన్నారు. పుట్టిల్లు, అగ్గి రాముడు చిత్రాలలో బుర్రకథలు చెప్పారని, నిలువు దోపిడీ, పెత్తందార్లు సినిమాలలో నటించారని, పూలరంగడు సినిమాకు అక్కినేని నాగేశ్వరావుకు బుర్రకథ నేర్పించారని తెలియజేశారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ నాజర్ రచించిన 'ఆసామి' నాటకానికి ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో ప్రథమ బహుమతి లభించిందని, ఆంధ్ర నాటక అకాడమీ వారు ఉత్తమ కళాకారుడు అవార్డు ప్రకటించారని, 1986లో పద్మశ్రీ అవార్డు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలియజేశారు. ఈ సభలో అల్లూరమ్మ, ఎన్ కృష్ణ, మస్తాన్‌రెడ్డి, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు, రెంటాల మురళి రాధాకృష్ణమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు నాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



నాజర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం



కళ్యాణానికి హాజరయిన ప్రజాప్రతినిధులు

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ వీధిలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీశైల దేవ స్థానం వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన శివపార్వతుల కళ్యాణం భక్తులకు కనువిందు చేసింది. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ముందుగా దేవస్థానం ఈవో లవన్న ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, మంత్రి సురేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లవన్న వారికి శాలువలు కప్పి సన్మానించారు. వారితో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి, మార్కాపురం మునిసిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, శ్రీశైల దేవస్థానం మాజీ డైరెక్టర్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, విశ్వహిందూ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి యక్కలి రాఘవులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జార్జి విద్యాసంస్థల డైరెక్టర్, మంత్రి సురేష్ తనయుడు ఆదిమూలపు విశాల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్ గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్ రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, సూరె రమేష్, ఐవి సత్యనారాయణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ముస్తాక్ అహ్మద్

ముస్లిముల అభ్యున్నతిని విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ముస్లిముల అభ్యున్నతిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని టిడిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ ముస్తాక్ అహ్మద్ ఆరోపించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం యర్రగొండపాలెం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిముల ఆర్థిక, సామాజికాభివృద్ధికి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటూ వారి అభ్యున్నతిని మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జనాభాలో 14 శాతంగా ఉన్న ముస్లిములు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో గతం కంటే వెనుకబాటుకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కీలక రంగాల్లో ఒకటి రెండు శాతానికి పరిమితం అయ్యారని తెలిపారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూముల్ని విడిపించాలన్నారు. ముస్లిములకు రంజాన్ తోఫా, దుల్హన్, విదేశీ విద్యా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో యూనివర్సిటీ, నియోజకవర్గం కేంద్రంలో ఉర్దూ కాలేజీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో ముస్లిముల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ నాయకులు షేక్ జిలాని, షేక్ వలి, షేక్ మస్తాన్‌వలి, షేక్ జిలాని, ఎస్‌ఎండి యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

టెన్త్ విద్యార్థుల కోసం ప్రజ్ఞా వికాస పరీక్ష

ఎమ్మెల్సీ, పోటీ పరీక్షల నిపుణులు కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ కమిటీల ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్షను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు తెలిపారు.స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ప్రజ్ఞవికాస పరీక్షకు సంబంధించిన కరపత్రాలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తూ వారిని చదువులో ప్రోత్సహించేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్, ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్, హేమంత్ యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తి : యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 12న పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 12న స్థానిక గౌతమి డిగ్రీ కాలేజీలో మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె. అక్బర్, చలువాది శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.దేవరాజ్, నాయకులు బొడ్డు బ్రహ్మయ్య,జగదీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీదుర్గాసమేత బోగేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవము సందర్భంగా ఆదివారం ఎడ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం కాటంవారిపల్లె గ్రామానికి చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్ల జత 5301.5 అడుగులు లాగి ప్రథమ బహుమతిగా రూ.50వేల నగదును కైవసం చేసుకున్నాయి. విజేతలకు అల్లు శివరామకృష్ణారెడ్డి , గొట్టం నాగార్జునరెడ్డి బహుమతి అందజేశారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజుపల్లె గ్రామానికి చెందిన యర్రమల శోహిత్‌రెడ్డి ఎడ్ల జత 4818.6 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.40వేలను కైవశం చేసుకున్నాయి. విజేతకు శ్రీదుర్గా సమేత బోగేశ్వరస్వామి దేవస్థానం వారు బహుమతి అందజేశారు. నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గొటికె రవితేజరెడ్డి ఎడ్ల జత 4,750 అడుగులు లాగి తృతీయ బహుతి రూ.30వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని కీర్తిశేషులు గొట్టం హరిక్రిష్ణారెడ్డి, కీర్తిశేషులు అల్లు నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం అందజేశారు. ప్రకాశం జిల్లా కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన మేకలరాజు ఎడ్ల జత 4,500.4 అడుగులు లాగి నాల్గవ బహుమతిగా రూ.20వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని అల్లు సుబ్బరాయుడు, పిచ్చిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం మండలం వీరాయపల్లి గ్రామానికి చెందిన దూదేకుల నజీర్‌బాషా ఎడ్ల జత 4.404.3అడుగులు లాగి ఐదో బహుమతి రూ.15వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని గొట్టం ఆవులరెడ్డి, తిరుమలరెడ్డి మల్లికార్జునరెడ్డి అందజేశారు. వైఎస్ఆర్. కడప జిల్లా కలసపాడు మండలం కలసపాడు గ్రామానికి చెందిన బేటి వెంకటరెడ్డి ఎడ్ల జత 4,153.3అడుగులు లాగి 6వ బహుమతి రూ.10వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని గొట్టం వెంకటరఘురామిరెడ్డి అందజేశారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం దర్శి గ్రామానికి చెందిన గానుపెంట రాజశేఖర్‌రెడ్డి ఎడ్ల జత 4,041.9 అడుగులు లాగి 7వ బహుమతి రూ.8వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని వట్టి రంగారెడ్డి అందజేశారు. వైఎస్ఆర్.కడప జిల్లా కాశీనాయన మండలం కోడిగుండ్లపాడు గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అమరనాథరెడ్డి ఎడ్ల జత 4,002.7 అడుగులు లాగి 8వ బహుమతి రూ.5వేలను కైవశం చేసుకున్నాయి. ఈ బహుమతిని దూదేకుల లతీఫ్ కుమారుడు వలి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కోలాట ప్రదర్శన, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



బండలాగుతున్న ఎడ్ల జత

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల, కంకణాల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ 10 వ మహాసభలు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్ కత్తాలో ఈనెల 15 నుంచి 18 వరకూ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు తెలిపారు. మహాసభల విజయవంతాన్ని ఆకాంక్షిస్తూ స్థానిక ఎల్‌బిజి భవన్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని సంఘం సీనియర్ నాయకులు పట్టపు ప్రకాశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి 750 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రధానంగా భూమి, ఉపాధి, ఆహార భద్రత, విద్యా, వైద్యం, దళిత, గిరిజన, మహిళా, సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలు, కులోన్మాదం, మతోన్మాదం వంటి సమస్యలపై ఈ మహా సభల్లో చర్చించబోతున్నట్లు తెలిపారు. 17 సంవత్సరాల క్రితం ఉపాధి హామీ చట్టం వచ్చిన నాడు వంద రూపాయలు వేతనం ఉండగా నాటి బడ్జెట్‌లో 40 వేల కోట్లు కేటాయించారన్నారు. నేడు 257 రూపాయలు వేతనం ఉండగా 35 వేల కోట్లు కేటాయించారంటే గ్రామీణ పేదల పట్ల, ఉపాధి హామీ చట్టం అమలుపట్ల కేంద్ర ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పారిశ్రామిక మండళ్ళ, ప్రజా అవసరాల పేరుతో పేదల వద్దనున్న భూమిని బలవంతంగా గుంజుకొని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయన్నారు. సమాజం ఎంత మారినా నేటికీ దళితులు, గిరిజనులు, మహిళల మీద దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని వీటిని అడ్డుకునేందుకు చేపట్టే పోరాటాలను జాతీయ మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెజి.మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, యన్. శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

- కార్గో సేవలు విస్తృతం
- పండుగలకు ప్రత్యేక సర్వీసులు
- ప్రజారవాణా అధికారి సుధాకర్



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రయాణికులకు మెరుగైన సేవలందించటమే ఆర్‌టిసి లక్ష్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.సుధాకర్ పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్గో సేవలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణతోవిస్తృతపరిచామన్నారు. విద్యార్థులు, పండుగలు, తిరునాళ్ళకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అన్ని డిపోల పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రజా రవాణా సంస్థ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను సుధాకర్ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 8 డిపోలు ఉండగా, కందుకూరు నెల్లూరు జిల్లాలో, అద్దంకి, చీరాల డిపోలు బాపట్ల జిల్లాలో విలీనమయ్యాయి. పరిపాలనా సౌలభ్యం కోసం రీజియన్ యూనిట్ స్థానంలో జిల్లా యూనిట్‌గా ఏర్పడింది. ఐదు డిపోలు ఒంగోలు, పొదిలి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పరిధిలో 120 నుంచి 130 రూట్లలో 455 బస్సు సర్వీసులు నడుపుతున్నాం. వీటిలో 97 అద్దె బస్సులు కాగా, మిగిలినవి లన్నీ ఆర్‌టసి బస్సులే. సగటున ఒక్కో డిపో నుంచి 30 రూట్లల్లో బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. లాభనష్టాల ప్రమేయం లేకుండా ప్రయాణికుల సౌకర్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులు నడుపుతున్నాం.

పదవీ విరమణ 62 సంవత్సరాలు అమలు

కార్పొరేషన్ నుంచి ఆర్‌టిసి ప్రభుత్వ రంగంలో విలీనం కావటంతో ఉద్యోగులకు ఈ రంగంలో పనిచేసే సౌకర్యాలు అమల వుతున్నాయి. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు ఆర్‌టిసిలో అమలుకు ప్రభుత్వం అనుమ తించింది ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఉద్యోగ భద్రత లాంటి మెరుగైన సౌకర్యాలు పొంద గలుగు తున్నారు. ఫేసియల్ అటెండెన్స్ ఆర్‌టిసిలో అమలుకు చర్యలు చేపడుతున్నాం. తొలుత కార్యాలయాలలో పనిచేసే ఉద్యో గులకు అమలు చేస్తాం. ఫీల్డ్ స్టాఫ్‌కు సంబంధించిఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.

కార్గో సేవలు విస్తృతం

కార్గో సేవలు ప్రజలలో మంచి ఆదరణ పొందుతోంది. ప్రైవేట్ కార్గో వ్యవస్థ కంటే మెరుగైన సమయపాలన పాటించటం, డెలివరీ ఛార్జీలు తక్కువగా ఉండటంతో ప్రజల నుంచి విస్తృతమైన ఆదరణ లభిస్తోంది. 2021-22 సంవత్సరానికి సంబంధించి 2022 జనవరి నాటికి రూ.3.18 కోట్ల ఆదాయం వచ్చింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి 2022 డిసెంబర్ నాటికి రూ.4.84 కోట్ల ఆదాయం లభించింది.

ప్రైవేట్ ఆపరేటర్ల దూకుడుకు కళ్లెం

ఆర్‌టిసి పరిధిలో ప్రైవేట్ ఆపరేటర్లను ఎదుర్కొనేందుకు ఎస్‌పి మలిక గర్గ్ సహకారం అందిస్తున్నారు. ప్రధానంగా ఆర్‌టిసి బస్టాండ్ పరిధిలో 2కిలోమీటర్ల పరిధిలో ప్రైవేట్ ట్రావెల్స్ అపరేట్ చేయటం చట్ట విరుద్ధం. గతంలో ప్రైవేట్ ఆపరేటర్లు విస్తృతంగా ఆర్‌టిసి డిపో ఎదురుగానే కార్యకలాపాలు కొనసాగించే పరిస్థితి ఉండేది. ఈ విషయాన్ని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్ళగా సానుకూలంగా స్పందించి చర్యలు చేపట్టారు. పోలీస్ అధికారుల ద్వారా ఒంగోలు ఆర్‌టిసి డిపో

ముఖాముఖి

పరిధిలో ప్రైవేట్ ట్రావెల్స్ నిలుపుదల చేయకుండా చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు ప్రత్యేక సర్వీసులు

కేంద్రీయ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. జిల్లా పరిధిలో పలు ప్రాంతాలలో ఈ సౌకర్యం కల్పించాం. మార్కాపురం డిపో పరిధిలో 35 సర్వీసులు నడుపుతున్నాం. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సౌకర్యం కోసం అన్ని రూట్లల్లో బస్సు సర్వీసులు నడుపుతున్నాం.

పండుగలకు ప్రత్యేక బస్సులు

ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరిచే క్రమంలో హైదరాబాద్‌కు రెండు ప్రత్యేక స్లీపర్ సర్వీసులు ప్రవేశపెట్టాం, కనిగిరి డిపో నుంచి మరో రెండు సర్వీసులు నడిపేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ప్రయాణికుల సంక్షేమం దృష్ట్యా సంక్రాంతి, వివిధ తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ఈ ఏడాది సంక్రాంతికి 210 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపాం. వీటిలో 99 శాతం హైదరాబాద్‌కి నడిపాం. గత ఏడాది 135 సర్వీసులు నడిపితే ఈ సంవత్సరం 50 శాతం సర్వీసులు పెంచటంతో పాటు రెగ్యులర్ ఛార్జి వసూలు చేశాం. గతంలో అదనపు బస్సు ఛార్జి వసూలు చేసేవారు. కడపకు కొత్త సర్వీసును ప్రారంభించాం.

ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం

ప్రయాణికులకు సౌకర్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నాం. అన్ని డిపోలలో తాగునీటి సౌకర్యం కల్పించాం. మార్కాపురం డిపోకు ఎన్ఎస్‌పి కెనాల్ నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు కనెక్షన్ ఇప్పించాం. కనిగిరి డిపోకు కూడా అవకాశం ఉంది. అక్కడ పైపులైన్ కనెక్షన్ తీసుకుంటాం. ప్రస్తుతం గిద్దలూరు, కనిగిరి డిపోలలో దాతల ద్వారా ఉచిత మినరల్ వాటర్ సరఫరా కొనసాగుతోంది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో తాగునీటికి ఇబ్బంది లేదు. ఈ ఏడాది వేసవికి అన్ని డిపోల పరిధిలో తాగునీటి వసతి మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటాం.